అందుకే ఆయన జవాబు చెప్పలేకపోయారు.

దుర్వ్యసనాలతో ఆస్తి హరించుకు పోయింది.

ఉన్నన్నాళ్ళూ బాధ్యతల్ని విస్మరించారు.

ఈడొచ్చిన పిల్లకు ఏం చేయాలో ఆలోచించలేక పోయాడు.

అంతా అయిపోయాక బాధపడటం చేతులు కాలాక ఆకులు పట్టు కోవటం మాత్రమే.

ఆమె మాటల కంటే శిల్ప ఛీత్కారం కంటే... తను పోగొట్టుకోబోతున్న పరువు కంటే ఆయన్ని బాధిస్తున్న ఆలోచన ఒక్కటే...

ఆ తర్వాత ఎలా...

ఓ వారం రోజుల వ్యవధిలో తన ఆస్తిపై సర్వ హక్కుల్ని కోల్పోతున్నాడు.

కట్టుబట్టలతో నడిరోడ్డుపైకి అడుగు పెట్టబోతున్నాడు.

ముక్కుపచ్చలారని శిల్ప అసూర్యవంశ్య మాత్రమే కాదు..... ఆత్మాభిమానంగల ఆడపిల్ల.

## 2

ఉదయభానుని లేతకిరణాలు శారదానదిపై ప్రతిపలిస్తున్నాయి.

పల్లె దైనందిన జీవితానికి సమాయత్తమవుతున్న సూచనగా పొలాలకు వెళుతున్న కూలీ జనంతో ఏటిగట్టు సందడిగా వుంది.

రాత్రి కురిసిన మంచు బిందువులు  చెట్ల ఆకులపై నుండి సుతారంగా నేల జారుతూ ఉష:కాంత అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

రకరకాల క్రోటన్లతో పూలచెట్లతో నిండిన పూదోటలో వనకన్యలా నిలబడ్డ శిల్ప శీతల పవనాల శైత్యోపచారాల్ని తట్టుకోలేని దానిలా గంభీరంగా ముందుకు నడిచింది.

గత వైభవపు  సౌరభాలను వెదజల్లుతున్న ఆ గోగిలి, శతాబ్దాలకు చరిత్రకు కాణాచి అయిన ఆ విశాలమైన భవంతి, మరికొన్ని, రోజులలో తమకు దూరమౌతుందని అందర్కంటే ప్రత్యేకంగా బ్రతికిన తను మరికోంత కాలంలో అందరిలో ఒకతి కాబోతుందన్న తలంపు కంపించిపోయింది.

ప్రమాదంనుండి గట్టెక్కే మార్గాల కోసం అన్వేషించకుండా ముఖం చాటేస్తూ గదిలోనే ఉంటున్న నాన్నగారంటే ఆమెలో రోజురోజుకీ చిన్న చూపు ఎక్కువ కాసాగింది.

'అమ్మగారూ!'

నౌకరు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది.

'అయ్యగారి కోసం ఎవరో వచ్చారండి.'

గది లోపల గడియ  పెట్టుక్కూర్చుంటున్న రంగనాథం గార్ని సమీపించటం ఈ మధ్య అందరికీ సాధ్యం కావటం లేదు. నౌకర్లపై ప్రతి చిన్న విషయానికి విరుచుకు పడటం అలవాటు కావటంతో దగ్గరికి వెళ్ళటానికి ఎవరూ సాహసించలేక పోతున్నారు.

నౌకరు అందించిన విజిటింగ్ కార్డు అందుకుని కొన్ని క్షణాలు పాటు చూస్తూ నిలబడ

శిల్ప ఏదో నిశ్చయానికి వచ్చిన దానిలా రంగనాధంగారి గదిని సమీపించి నెమ్మదిగా తలుపు తట్టింది.

తలుపులు తెరచి రంగనాధంగార్ని చూడగానే శిల్ప మనసు ఆర్ధ్రమైంది.

మాసిన గెడ్డంతోను, పీక్కుపోయిన మొహంతోనూ గుర్తుపట్టలేనంతగా మారిపోయారాయన.

'మీకోసం ఎవరో వచ్చారు వైజాగ్ నుంచి.'

'నేనెవర్నీ చూడదలుచుకోలేదు' అనబోయి శిల్ప 'వెళ్ళిరండి' అంటూ కార్డు అందించటంతో కాదనలేనట్టుగా బయటకు నడిచారు.

ఎంబాసిడర్‌ను ఆనుకొని నిలబడ్డ ఆగంతుకుడ్ని పిలుస్తూ లాన్‌లోని కుర్చీలో ఆసీనులయ్యారు.

'నమస్కారం.... నాపేరు భూషణ్...పియె టు మిష్టర్ కిరీటి. మేనేజింగ్ డైరెక్టరాఫ్ మాలిని మెషిన్‌టూల్స్, డైరెక్టరాఫ్ డీన్ ఇంజనీరింగ్ వర్కుస్, ఛైర్మన్ ఆఫ్ చక్రవర్తి...'

'వచ్చినపని....'

రంగనాధంగారు సాధికారంగా ప్రశ్నించేసరికి ఆర్ధోక్తిలో ఆగిపోయాడు భూషణ్.

భూషణ్‌ని పూర్తిగా చెప్పనిస్తే ఫైనాన్సర్స్ అన్న వాక్యం రంగనాధంగార్ని ఉలిక్కిపడేటట్టు చేసేదే.

ఆ ఫైనాన్సింగ్ కంపెనీయే తనకు అంత అప్పించ్చిందని అది తీర్చనందుకే కోర్టు తన ఆస్తి పై జప్తువారంటు నిచ్చిందని గుర్తించేవారు.

కాని అవతలి వారు చెప్పిందంతా వినే సహనం చచ్చిపోయిందీ మధ్య.

'నను కిరీటి గారే మీ దగ్గరకు పంపారు.'

'దేనికి...'

రంగనాధంగారు ప్రశ్నార్ధకంగా చూశారు.

'సుప్రీంకోర్టు మీకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు, వారంరోజుల్లో మీఆస్తి జప్తు చేయబడే వివరాలు అన్నీ ఆయన తెలుసుకున్నారు....'

'అయితే '

రంగనాధంగారి భృకుటి విచిత్రంగా ముడిచింది.

'అదే ... మీకు సహాయం చేయడానికి తను సిద్ధంగా ఉన్నానని ఎటువంటి అవసరానికైనా తనను కలుసుకోవచ్చునని మీకు కబురు చెప్పమన్నారు... ఇదీ వారి ఫోన్ నంబరు- వైజాగ్ లోని వారి బంగాళా అడ్రసూను అవసరమైతే కలవండి.'

గడగడా చెప్పి 'శలవ్' అంటూ నమస్కారం చేసి వెళ్ళి కారులో కూర్చున్న భూషణ్‌ని, చేతిలోని కార్డుని ఆశ్చర్యంతోనూ అర్ధంకానట్లుగానూ చూస్తూ చాలాచేపు ఉండిపోయారు.

ఎవరీ కిరీటి?

తనకు సహాయం చేయటానికి తనంతట తానుగా ముందుకు రావటంలో గల ఔచిత్యమేమిటి?

దీని వెనుక ఏమైనా తను గుర్తించలేని పథకం వుందా ?

ప్రమాదం మరో నాలుగు రోజుల దూరంలో వుంది.

కోర్టు ఉత్తర్వును ఆపు చేయాలంటే అయిదు లక్షల రూపాయల్ని నాలుగురోజుల వ్యవధిలో చెల్లించాలి.

అలా కాకపోతే...

భరింపశఖ్య పర్యవసానాన్ని ఎదుర్కోవాలి.

ఎవరైనా కానీ....

అపద్ధర్మంగా ఆదుకోబోయే ఆ పెద్దమనిషిని కలిస్తే పోయిందేముంది.

3

వాల్తేరు ఆఫ్ లాండ్స్‌లో సిటీకి దూరంగా సముద్రానికి అతి చేరువుగా అత్యంతాధునికంగా నిర్మించిబడిన పోష్ బంగళా మాలినీ నిలయం....

కాంపౌండ్ వాలు మొదలుకొని బంగళావరకు పేర్లు తెలీని వివిధరకాల పూల చెట్లతోను పూతోటకు మధ్యగా ఆహ్లాదాన్ని కలిగించే ఫౌంటెన్ లోను బోగన్‌విల్లా అల్లుకున్న పోర్టికోతోనూ అద్దాల తలుపులతో అతిరమ్యంగా కనిపించే ఆ భవంతి ఆర్కిటెక్ట్ అద్భుత మేధాశక్తికి అది కట్టించిన వ్య క్తికళా హృదయానికి ప్రతీకలా వుంటుంది.

డబ్బులో పుట్టి డబ్బులో పెరిగిన రంగనాధంగారే ఆ కట్టడ నిర్మాణానికి అమితాశ్చర్యపోయారు.

వచ్చి రెండు గంటలసేపైనా కిరీటి దర్శనం దొరక్కపోవటంతో కొద్దిపాటి విసుగు లాంటిది కలిగి డ్రాయింగు హాలునుండి లాన్‌లోకి వచ్చి నిలబడ్డారు.

ఓ పదిహేను నిమిషాల్లో పియె భూషణ్ వచ్చి డైరెక్టర్స్ కాన్ఫరెన్సు ముగించుకొని కిరీటిగారు వస్తున్నారని పదకుండుంపావుకు అపాయింటుమెంటు ఇచ్చారని చెప్పేసరికి రంగనాధంగారు వాచీ చూచుకొన్నారు. ఇంకా పది నిమిషాలవ్యవధి ఉందన్నమాట.

ఆలోచనల మధ్యనే అయిదు నిమిషాలు గడిచింది.

భూషణ్ హడావిడిగా అటు ఇటు తిరుగుతున్నాడు.

మరో రెండు నిమిషాలలో కారు హారన్ వినిపించేసరికి బంగళా అంతటా నిశ్శబ్దం పేరుకుపోయింది.

మెయిన్ గేటు దగ్గర గూర్ఖా సెల్యూట్ నందుకున్న బెంజ్ రయ్యిమంటూ లోపలికి దూసుకు వచ్చి పోర్టికోలో ఆగింది.

తెల్లని యూనిఫాంలో నిలబడ్డ నౌకరు వంగి డోర్ తెరవగానే హుందాగా బయటకు వచ్చిన కిరీటి పరిసరాలను గమనించటానికి వ్యవధి లేనట్టుగా ఠీవీగా లోపలికి వెళ్ళాడు.

అంత సేపటినుండి కిరీటి వయసు మళ్ళీనవాడై ఉంటాడని తలపోయిన రంగనాథంగారు గ్రేకలర్ సూట్ లో పాతిక ముప్పైఏళ్ళ మధ్య వయసులో ఉన్నట్టుగా కనిపించిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయారు.

సరిగ్గా పదకొండు పదిహేనుకి రంగనాథంగారికి పిలుపు రావటంతో హడావిడిగా లోపలికి నడిచారు.

మెత్తని మఖ్మల్ కార్పెట్పై నడుస్తూ సినిమా సెట్లా వున్న గదుల అందాల్ని ఇంద్రధనస్సులోని రంగుల్ని తలపింపజేసే డిస్టెంపర్ గోడల్ని గోడలపై అందంగా అలంకరించిన ఆయిల్ పెయింట్స్నీ, కార్వ్డ్ వుడెన్ వార్డ్ రోబ్స్నీ చూస్తూ రెండు గదుల్ని దాటారు. తర్వాత ఓ విశాలమైనహాలు. దానికి ఆనుకొని లోపల కిరీటి పర్సనల్ రూమ్.

స్వింగ్ డోర్ తెరుచుకొని లోపలికి అడుగు పెడుతుంటే రంగనాథంగారి గుండె దడ దడ లాడింది.....

రివాల్వింగ్ చెయిర్లో కూర్చొని ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్న కిరీటి ఒక్కక్షణం రంగనాథంగార్ని చూసి తలపంకించి 'ప్లీజ్ బి సీటెడ్' అంటూ సంజ్ఞ చేసి తన పనిలో తాను నిమగ్న మై పోయాడు.

'యస్ మిష్టర్ సిన్హా! ఇన్స్యూర్డ్ మెటీరియల్ అని నిర్లక్ష్యం చేయకండి. నలభై లక్షల ఖరీదు చేసే హారిజాంటల్ బోరింగ్ మెషినిది. జాగ్రత్తగా పేక్ చేసి షిప్కు లోడ్ చేయండి. ఐయామ్ నాట్ గోయింగ్ టు టాలరేట్ యివెన్ మైన్యూట్ డేమేజస్....ఓకే!' అంటూ ఫోన్ క్రెడిల్ చేశాడు.

సెంట్రలైజ్డ్ ఏసి కావడంతో రంగనాథంగారు కాస్త చలిగా ఫీలవుతుంటే 'యస్ ...ఎనీ డ్రింక్స్' అంటూ పలకరించాడు కిరీటి.

అక్కర్లేదన్నట్టుగా తల అడ్డంగా వూపి 'నాపేరు రంగనాథం... రాజానరేంద్రదేవ్ కుమారుడ్ని.' అంటూ తనను తాను పరిచయంచేసుకుంటూంటే 'అఫ్కోర్స్' అన్న సన్నని నిట్టూర్పుతో రేబాన్ కూలింగ్ గ్లాసేస్ని తీసి టేబుల్పై వుంచాడు కిరీటి.

రంగనాథంగారి కను బొమ్మలు ముడిపడ్డాయి.

మగాళ్ళను సైతం మైమరపింప చేసే కిరీటి నేత్ర ద్వయాన్ని చూస్తుంటే బాగా పరిచయమున్న వ్యక్తిలా అనిపించాడు.

కాని ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తి ఎవరైంది గుర్తుపట్ట లేకపోయారు.

'నేను మీకు అప్పిచ్చిన చక్రవర్తి ఫైనాన్సింగ్ కంపెనీ చైర్మన్ని...'

కిరీటి చెప్పిన వాక్యంతో రంగనాథంగారి ఆలోచనలు తెగిపోయాయి. అతనితో [illegible] ఆ సంస్థతో తనకు సుపరిచితమే.

'కోర్టు నిర్ణయం మాకు అనుకూలంగా వచ్చిన విషయం మీకు తెలుసనుకుంటాను.'

తెలిసిన విషయాన్ని మరోసారి తెలియపరచటంలో ఉద్దేశ్యమేమిటో ఆయనకు అర్థం కాలేదు.

'ఇలా ఈనాడు మిమ్మల్ని పిలవడంలో గల ఉద్దేశ్యం మిమ్మల్ని ఆదుకోవాలనుకోవటం...'

ఉలిక్కిపడ్డారాయన... కోర్టుకు లాగించెందుకు.... అంతానిర్ణయమయ్యాక ఆదుకోవడమెందుకు?

'నాకు తెలుసు నా మాటలకు మీరు ఆశ్చర్యపోతున్నారాని ... కానీ యీ వ్యవహారం ఇంతవరకూ రావటానిక్కారణం మీరు రాజానరేంద్రదేవ్ వంశానికి చెందినవారని మాకు తెలియక పోవటం... రెండవది...'

ఫోన్ ఎక్స్‌టెన్షన్ బజర్ వినిపించటంతో రిసీవర్ అందుకున్నాడు కిరీటి.

'యస్ .... కిరీటి హియర్ ..నోనో మిష్టర్ మల్హోత్రా ఫ్యాక్టరీ ఎక్స్‌టెన్షన్‌కి వన్నెండాఫ్‌క్రోర్ సరిపోదని మీబ్యాంక్ ఛైర్మన్‌కు చెప్పండి... ఐనీడ్ మినిమమ్ ఫోర్ క్రోర్స్ యస్ ...దట్సాల్....'

ఫోన్ క్రెడిల్ చేశాడు.

'యస్... రెండవది.... మీఅమ్మాయి శిల్పంటే నాకు ఇష్టముండటం... మూడవది... ఆమెను నా భార్యగా చేసుకోవాలన్న అభిలాష కలగడం.....'

కిరీటి నిర్మోహమాటానికి రంగనాథంగారు షాక్ తిన్నారు.

అవమానంతోనూ, ఆవేశంతోనూ ఆయన చేతులు బిగుసుకున్నాయి.

'మీ పరిస్థితిని అవకాశంగా తీసుకున్నట్టుగా మీకు అనిపిస్తే ...ఐయామ్ వెరీసారీ' కిరీటి భుజాలేగరేశాడు.

'అవకాశం తీసుకున్నందుకు నేను భాదపడటంలేదు మిష్టర్ కిరీటి! మీ సాహసానికి నేను ఆశ్చర్యపోతున్నాను,'

'నాకు డొంక తిరుగుడుగా మాట్లాడటం చేతకాదు రంగనాథంగారూ! ఐయామ్ బిజీనెస్ మేన్.'